క్లుప్తంగా

నేడు 'మనకోసం శంకరన్న'

అమరావతి: మండల పరిధిలోని మూడు గ్రామాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం మన కోసం – శంకరన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు. 11 గంటలకు వైకుంఠపురం, సాయంత్రం 4 గంటలకు చావపాడు, 5 గంటలకు ఎండ్రాయి గ్రామాలలో మండల స్థాయి అధికారులు, గ్రామస్తులతో ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పెదకూరపాడు: గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఎంఈవో–2తాడిశెట్టి సత్యనారయణ, పేరేచర్ల వెంకట దుర్గప్రసాద్, చిర్రా శ్రీనివాసరెడ్డి, రాయపూడి సాంబశివరావు, షేక్ న్యామతుల్లా, సిస్టర్ దాసరి విజకుమారిని శుక్రవారం మండల విద్యా వనరుల భవనంలో ఉపాధ్యాయ సంఘాలు సన్మానించాయి. విద్యాశాఖాధికారి ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి, వారి అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మేడా రాధకృష్ణమూర్తి, నాగభూషన్‌రెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా పొందిన ఆర్మీ ఉద్యోగి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలేనికి చెందిన ఆర్మీ ఉద్యోగి అన్నపరెడ్డి కోటిలింగారెడ్డి పీహెచ్‌డీ పట్టా పొందారు. జార్ఖండ్ రాష్ట్రం కోడెర్మాలోని క్యాపిటల్ యూనివర్సిటీ ఫిజియోథెరపీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా సాధించినట్లు కోటిలింగారెడ్డి తెలిపారు. 1996లో ఆర్మీ మెడికల్ విభాగంలో ఫిజియోథెపిస్ట్‌గా విధులు నిర్వహిస్తూనే.. ఆ విభాగంలో పలు అంశాలపై ఆసక్తితో మాస్టర్స్ లెవల్‌లో ప్రత్యేకంగా స్పోర్ట్స్ మెడిసిన్ చేశారు. పీహెచ్‌డీ కూడా సాధించారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్‌లోని ఆర్మీ వైద్యశాలలో ఫిజియోథెరపీ విభాగంలో వైద్యసేవలందిస్తున్నారు. భార్య ఉమా మహేశ్వరి కూడా ప్రవేటుగా పిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్నారు.



పోలింగ్ బూత్ పరిశీలన



రాజుపాలెం: పోలింగ్ బూత్‌లలో నిబంధనల ప్రకారం మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు అష్రఫున్నీసా అన్నారు. ఇనిమెట్ల గ్రామంలోని 165వ పోలింగ్ బూత్‌ను మార్చాలని వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో శుక్రవారం ఆమె పరిశీలన చేపట్టారు. విద్యుత్ సౌకర్యం, ఓటర్ల రాకపోకలకు వసతి, భద్రత, మౌళిక వసతులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, మార్చాల్సిన అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ



క్రోసూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సహృదయ ఫౌండేషన్ అధ్యక్షులు పట్టీల శ్రీనివాసరావు, పులిపాటి వెంకట పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 18 ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా.. ప్రతి రోజు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలా గఫూర్, బీసీ నాయకులు గంజినబోయిన శ్రీనివాసరవు, ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, రైతు మురళి తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సిద్ధం

- వినాయక చవితి వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు
- మండపాల ఏర్పాటులో నిబంధనలు తప్పనిసరి
- ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- భద్రతా చర్యలు పాటించాలంటున్న అధికారులు



పట్టణంలోని గాంధీబొమ్మ సెంటరులో ఏర్పాటు చేస్తున్న మండపం

సత్తెనపల్లి: గణనాథుడి ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. ఊరూవాడా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోనున్నారు. ఈ నెల 18న బొజ్జ గణపయ్య భక్తులు సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో కొలువుదీరనున్నాడు. ఉత్సవ కమిటీలు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. సత్తెనపల్లి డివిజన్‌లో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను ఈ సారి ఏర్పాటు చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే చవితి వేడుకల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. అయితే.. భక్తితో పాటు భద్రతా ముఖ్యమేమని అధికారులు అంటున్నారు. ప్రమాదాలు జరగకుండా గణేష్ మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

మండపాల నిర్మాణంలో పాటించాల్సిన జాగ్రత్తలు..

- మండపాలను విశాలమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలి.
- తడికెలతో కాకుండా ఆస్‌బెస్టాస్ రేకులతో నిర్మించుకోవాలి. వీటి వల్ల అగ్ని ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది.
- కాలనీ వాసులు, భక్తులు దర్శించుకుని వెళ్లేలా విశాలంగా ఉండాలి.
- మండపాల వద్ద అవసరమైన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ నియంత్రికలు ఉన్న చోట, విద్యుత్ వైర్ల కింద మండపాలను ఏర్పాటు చేయకూడదు.
- మండపాలకు విద్యుత్ సౌకర్యం కోసం కచ్చితంగా ఆ శాఖ అధికారులు అనుమతి పొందాలి.
- విద్యుత్ అవసరాల కోసం ఐఎస్ఐ మార్కు కలిగిన తీగలను వినియోగించాలి.
- విగ్రహాల దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూ పద్ధతి పాటించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- వినాయక ప్రతిమల ఎదుట ఉంచే దీపాలపై నిరంతర నిఘా ఉండాలి.
- మండపాల సమీపంలో బాణ సంచా కాల్చకూడదు.
- పెట్రోల్, కిరోసిన్, గ్యాస్ సిలిండర్ల లాంటి పేలుడు పదార్థాలను మండలపాల వద్ద ఉంచరాదు.
- మండపాల వద్ద సరిపడా ఇసుక, నీరు, అగ్ని నిరోధక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
- అత్యవసర సేవల నిమిత్తం 100, 101, 108 నంబర్లు తెలిపే సూచికలు ఏర్పాటు చేసుకోవాలి.
- పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, వైద్య శాఖ అధికారుల నంబర్లు ఉంచుకోవాలి.

ప్రశాంతత ముఖ్యం ...

- రాత్రిళ్లు అధిక శబ్దాలతో మైకులు పెట్టి ఆ ప్రాంత వాసులను ఇబ్బంది పెట్టరాదు.
- మండపాల వద్ద పరిశుభ్రత పాటించాలి. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మండపాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

ఉత్సవ కమిటీలకు సూచనలు

- గణేశ్ ఉత్సవ కమిటీలు పోలీసుల సూచనలు కచ్చితంగా పాటించాలి.
- గణనాథుడిని భగవంతుని ప్రతి రూపంగానే భావించి, ఆ రూపం చెడకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి.
- పోటీ పడి భారీ గణనాథులను కాకుండా చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం శ్రేయస్కరం.
- రోజు సామూహిక పూజలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేయాలి.
- పిల్లలు, మహిళలకు వివిధ రకాలు పోటీలు నిర్వహించాలి .
- మండపాల వద్ద అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు తారసపడితే పోలీసులకు, ఉత్సవ కమిటీ వారికి సమాచారం ఇవ్వాలి.

అనుమతితోనే మండపాల ఏర్పాటు



వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, పోలీస్, ఫైర్ అనుమతులు తీసుకోవాలి.ప్రతి మండపానికి ఉత్సవ కమిటీ ఐదుగురు లేక ఎక్కువ మంది ఉండాలి. కమిటీ గుర్తింపు కార్డులు పొందాలి. మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించాలి. పగలు 55, రాత్రులు 45 డెసిబల్స్‌కు మించకుండా స్పీకర్లను ఉపయోగించాలి. డీజేలతో సౌండ్ దద్దరిల్లేలా చేయకూడదు. విగ్రహం ఎన్ని రోజులు ఉంటుంది? ఎక్కడ నిమజ్జనం చేస్తారు? మార్గం తదితర అన్ని వివరాలు ముందస్తుగా పోలీసులకు తెలియజేయాలి.

బి.ఆదినారాయణ, డీఎస్పీ, సత్తెనపల్లి

స్కూల్ గేమ్స్ ఎంపికలు ప్రారంభం



అమరావతి: స్థానిక రామకృష్ణ హిందూ హైస్కూల్లో ఎస్‌జీఎఫ్ఐ అండర్– 14, 17 విభాగాల్లో బాల బాలికలకు మండల స్థాయి ఆటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు క్రీడా పోటీలను ప్రారంభించారు. మునుగోడు, మల్లాది, లింగాపురం, మండపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, శ్రీరామకృష్ణ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో రాణించి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మేడా శ్రీనివాసరావు, శివబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు పోరెడ్డి శివరామిరెడ్డి, హెచ్ఎం రాము, ఆయా పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండా చెట్టుకు భూమి పూజ

మాచర్ల: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిలా, తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని బండ్లబజారులో నూతనంగా నిర్మిస్తున్న జెండా చెట్టు నిర్మాణానికి ఆయన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. జగన్‌కు మద్దతు పలకాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనార్టీ నేతలు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను కన్న బిడ్డల్లా చూసుకోవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అంగన్‌వాడీ సిబ్బందితోమాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కన్న బిడ్డల్లా చూసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, సూపర్ వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి నెలా 1,359 మంది గర్భిణిలకు రూ.11లక్షలు, 1,309 మంది బాలింతలకు రూ.10.93లక్షలు,7,652 మంది మూడేళ్లోపు చిన్నారులకు రూ.31.52లక్షలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, స్పష్టం చేశారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదకూరపాడు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య నదులకు ఆనకట్టలు నిర్మించి, దేశ ఆర్థికాభివృద్ధికి కృషి చేశారని 75త్యాళ్ళూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

- సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి
- నియోజకవర్గస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: ఓటర్లు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం సత్తెనపల్లి నియోజకవర్గంలో పక్కాగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన, పెండింగ్‌లో ఉన్న అన్ని అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామన్నారు. సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులకు తావులేని, స్వచ్ఛమైన ఓటర్లు జాబితా తయారీకి యంత్రాంగం అన్ని చర్యలు తీసుకు న్నట్లు ఆర్డీఓ స్పష్టం చేశారు. అదేవిధంగా రేషనలైజేషన్ ప్రక్రియపై సూచనలు ఉంటే వెంటనే అందజేయాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సత్తెనపల్లి రూరల్ మండలంలోని ఐదు పోలింగ్ స్టేషన్ల ముఖపత్రం మార్పులు, నకరికల్లు మండలంలోని మూడు లోకేషన్ మార్పులు, 45 పోలింగ్ స్టేషన్ల ముఖ పత్రం మార్పు, ముప్పాళ్ళ మండలంలో 11 పోలింగ్ స్టేషన్ల ముఖ పత్రాల మార్పులు వెరశి 61 పోలింగ్ స్టేషన్ల ముఖ పత్రాల మార్పులు, మూడు లోకేషన్ మార్పులతో రేషనలైజేషన్ ప్రక్రియ పై నియోజకవర్గ పరిధిలో తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్లు ఎస్.సురేష్ (సత్తెనపల్లి) ఎం. భవానీ శంకర్(ముప్పాళ్ళ) అష్రఫున్నీసా బేగం(రాజుపాలెం), సత్తెనపల్లి, నకరికల్లు సీనియర్ అసిస్టెంట్లు బోస్‌బాబు, రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యందనలో ప్రత్యేక వైద్య శిబిరం



పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న డీఎంవో రవీంద్ర రత్నాకర్

ఉయ్యందన(క్రోసూరు): మండలంలోని ఉయ్యందన గ్రామంలో సీజనల్ జ్వరాలు రాకుండా ఉండేందుకు గ్రామ సబ్ సెంటర్‌లో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎన్ఎం ఎస్.సరస్వతీ, ఎంఎల్‌పీహెచ్ వీరయ్య చౌదరి పాల్గొన్నారు. గ్రామంలో డ్రైడే నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ రవీంద్రరత్నాకర్, సబ్‌యూనిట్ అధికారి బేగ్ పాల్గొని సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంవో గ్రామస్తులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించి, ఎబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. దోమ లార్వా వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే వ్యర్థపదార్థాలు, ఉపయోగించని డబ్బాలు, కొబ్బరి బోండాలను తొలగించారు.

రజక ఆత్మగౌరవ మహాసభకు తరలిరావాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 15న రాజధాని అమరావతిలో నిర్వహించనున్న రజక ఆత్మగౌరవ మహాసభకు భారీగా రజక సోదరులు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల అధ్యక్షుడు పాతపాట అంజిబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం అమరావతిలో నిర్వహించిన రజక సంఘీయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ సాధన కోసం ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు పైడా సాంబశివరావు, నాయకులు దుర్గాప్రసాద్, పుల్లారావు పాల్గొన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు అవగాహన సదస్సులు

నకరికల్లు: మండలంలోని అన్ని గ్రామాల వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. నకరికల్లు 1, 2 సచివాలయాలు, రూపెనగుంట్ల సచివాలయం వలంటీర్లకు ఈ నెల 16న, గుండ్లపల్లి–1, చేజర్ల వలంటీర్లకు 19న, చాగల్లు వలంటీర్లకు 20న, చల్లగుండ్ల వలంటీర్లకు 21న, చీమలమర్రి వలంటీర్లకు 22న, కండ్లకుంట వలంటీర్లకు 23న, నర్సింగపాడు, గుండ్లపల్లి–2 వలంటీర్లకు 25న, కుంకలగుంట 1, 2 సచివాలయాల వలంటీర్లకు 26న అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ



అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. 15 మంది పింఛనుదారులకు వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్, సర్పంచ్ నాయుడు రాంబాబు నగదు అందజేశారు. మండల పరిధిలోని చావపాడులో నూతనంగా మంజూరైన పది పింఛన్లను గ్రామ సర్పంచ్ చిలకా ఆనందరావు పంపిణీ చేశారు.

విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాలెం: వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాటు చేసే మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఏఈ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండప కమిటీ దరఖాస్తు చేసుకుంటే..సచివాలయం ద్వారా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ఉత్సవ నిర్వహణ రోజులను తెలియజేయాలని తెలిపారు.

ప్రారంభమైన 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభమైంది. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. యాప్‌లో వివరాలను నమోదు చేశారు. పంచాయతీ సెక్రటరీలు వెంకటేశ్వరరావు, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో భారత ప్రభుత్వ వినియోగదారుల సంబంధాలు ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర పరిశీలకులు డా, బి.గోపాల కృష్ణయ్య మాట్లాడుతూ వస్తువులను నాణ్యతను పరిశీలించిన అనంతరం కొనుగోలు చేయాలని చెప్పారు. కలుషిత ఆహార పదార్థాలు, వస్తువులను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన ఎస్.క్లారా, పి.మానస, బి.ప్రసన్న, కె.నవ్యకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పల్ టి.ఉషారాణి, సంధ్యారాణి, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.

రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పలుదేవర్లపాడులో రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్యామ్‌ప్రసాద్, తహసీల్దారు

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పలుదేవర్లపాడు గ్రామంలో జరుగుతున్న రీ–సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. మొదటి విడతగా ఎంపికైన ఆరు గ్రామాల్లో సర్వే పూర్తిచేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. యజమానులకు భూ రక్ష కార్డులు అందించాలన్నారు. మూడు రోజుల ముందుగానే భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలని, వారి వద్ద నున్న హక్కుపత్రాల ద్వారా కొలతలు పూర్తి చేయాలన్నారు. కొలతల్లో ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత సర్వే నంబరులోని భూముల రైతుల సమక్షంలో కొలత పూర్తి చేసి, సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. తహసీల్దారు ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వే సిబ్బంది ఉన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- పాపాయపాలెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'



పాపాయపాలెంలో సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: పార్టీలకు అతీతంగా అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. గురువారం పాపాయపాలెంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీకి వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై కాలనీ వాసులను విచారించారు. మురుగు నీటి పారుదలకు డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు చెప్పారు. అందరూ ఏకతాటిపై నిలవాలని, సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే శంకరరావు సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేశారు. నాలుగేళ్లలో రూ.14కోట్ల సంక్షేమ, అభివృద్ధి గ్రామానికి అందించినట్లు ఎమ్మెల్యే శంకరరావు తెలిపారు. సంక్షేమ పథకాల రూపంలో రూ.10.62 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.3.91 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. మండలంలో అన్నీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారంతో పూర్తి అయింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రతీ ఇంటి తలుపు తట్టి సంక్షేమ లబ్దిని వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, సర్పంచ్ చిమటా మాధవి, సైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, మర్రి పెద బ్రహ్మారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ చిన బ్రహ్మారెడ్డి, కొమ్ము శ్యాంబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో అభివృద్ధి చేసి చూపించాం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్దిదారులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేగా నాలుగున్నరేళ్ల కాలంలో పదింతల అభివృద్ధి చేసి చూపించానన్నారు. పదేళ్ల కాలంలో రోడ్డకు తట్టెడు మట్టి కూడా వేయలేని వారు తనపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాలకు వస్తే తమ ప్రభుత్వంలో తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందని ఎమ్మెల్యే హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే సొంత గ్రామంలో పదేళ్లగా కనీసం సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. మారుమూల గ్రామాలకు కూడా తారు రోడ్లను వేయిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.30 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణం చేపట్టి, పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా సంక్షేమ పథకాల కోసం రూ.280 కోట్లు ఖర్చు చేశామన్నారు. అమరావతి– తుళ్లూరు రోడ్డు, పెదమద్దూరు వద్ద హైలెవల్ వంతెన, అమరావతి– బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానన్నారు. నియోజకవర్గంలో 2019కి ముందు 29,910 మందికి మాత్రమే పింఛన్ల రూపంలో రూ. 3.07 కోట్లు ఇచ్చేవారని, కానీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక 38,344 మందికి ప్రతినెలా రూ.10.59కోట్లు పింఛన్ల ద్వారా అందిస్తున్నామన్నారు. నూతనంగా మంజూరైన 298 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, ఎంపీడీవో వెంకటరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, వైస్ ఎంపీపీలు అహ్మద్ పాషా, మరియదాసు, దరియా, సిరిపురం మేస్త్రీ, బడాబచ్చా, మౌలాలి, సర్పంచ్‌లు ఆసుల జగన్, వెంకటసైదయ్య, రమణారెడ్డి, నరసింహానాయక్, మేకల వెంకటస్వామి, కంభంపాటి పాప, శేషిరెడ్డి, సాంబశివారెడ్డి, బ్రహ్మం, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.